# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **'ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన' పథకాల కింద లక్ష కోట్ల రూపాయల ప్రతిపాదిత వ్యయానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

**2** **తిరుమల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈరోజు జరిగే ధ్వజారోహణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.**

**3.** **మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం మంత్రి అనిత తెలిపారు.**

**4.** **కుటుంబ డిజిటల్ కార్డు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.**

**5.** **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నుంచి మచిలీపట్నం నౌకాశ్రయానికి జలమార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**

==============================

సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత సాధించడానికి 'ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన' పథకాల కింద లక్ష కోట్లు రూపాయల ప్రతిపాదిత వ్యయానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిందని కేంద్ర సమాచార,ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న ఢిల్లీలో కేంద్ర మంత్రి వర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. మధ్యతరగతి ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు ఈ రెండు పథకాలు దోహదపడతాయని అన్నారు. తద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ

వాయిస్ (44 సెకన్లు)

వీటితో పాటుగా చెన్నైమెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశ, రైల్వే ఉద్యోగులకు బోనస్, దేశంలోని బెంగాలీ, అస్సామీ, మరాఠీ, ప్రాకృత, పాళి భాషలకు ప్రాచీన హోదాకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిందని కేంద్రమంత్రి తెలిపారు.

---

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో

భాగంగా ఈ రోజు సాయంత్రం జరిగే ధ్వజారోహణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఉండవల్లి నుంచి ఈ రోజు సాయంత్రం బయలుదేరి తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం తిరుమల చేరుకొని బేడి ఆంజనేయ స్వామిని దర్శించుకుని . ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. తర్వాత మాడవీధుల్లో జరిగే పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. రేపు తిరుమలలో నూతనంగా నిర్మించిన వకుళమాత నూతన కేంద్రీయ వంటశాలను ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

ఇది ఇలావుండగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు నుండి ఈ నెల 12వ తేదీ వరకు జరుగనున్న శ్రీవెంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు గత రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు.. ఇందులో భాగంగా శ్రీవారి తరపున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలోని యాగశాలలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఈరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. వేదమాతగా ప్రసిద్ధి పొందిన ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ పంచ ముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్టాన దేవత అయిన గాయత్రీదేవిని పూజిస్తే సకల ఉపద్రవాలూ తొలగుతాయనీ, బుద్ధి తేజోవంతం అవుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. మరోవైపు తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈరోజు ముద్దపప్పు బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

హైదరాబాద్ ను క్రీడా కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ తెలిపారు. నిన్న హైదరాబాద్ లోని ఎల్బీ క్రీడా మైదానంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు రాణించేలా తెలంగాణలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయంతో పాటు, అకాడమీని ప్రారంభించి క్రీడాకారులందరికీ శిక్షణ ఇస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. నిన్న అమరావతిలో మంత్రి మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ఈ తరహా కేసులను పరిష్కరించే విధంగా పోలీస్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తామన్నారు. టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. మత్తు పదార్థాల ఆచూకీ తెలిపిన వారికి ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. సామాజిక మాధ్యమ వేదికల ద్వారా యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కల్పిస్తామని చెప్పారు. మాదకద్రవ్యాలకు యువత అలవాటు పడకుండా చేయడంలో పౌరుల భాగస్వామ్యం కూడా అవసరం అని హోం మంత్రి పేర్కొన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కలుపుతూ జాతీయ రహదారి విస్తరణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రూపొందించిన ప్రణాళికతో మెరుగైన రవాణా సేవలు అందుబాటులోకి వస్తాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జాతీయ రహదారుల పనులపై నిన్న ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వినుకొండ– గుంటూరు రెండు లైన్ల మార్గాన్ని నాలుగు లైన్లుగా విస్తరించి మరో 25 కిలోమీటర్లు పొడిగిస్తూ, రాజధాని అమరావతి కోసం రూపొందించిన ప్రణాళిక రాజధాని ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రెండేళ్లలో హైవే నిర్మాణం పూర్తవుతుందని, దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరపున భూసేకరణ, విద్యుత్తు తదితర పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రి అధికారులను ఆదేశించారు.

-----------------------------

కుటుంబ డిజిటల్ కార్డు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని తాహెర్ కొండాపూర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'వన్ స్టేట్ వన్ కార్డు'లో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కుటుంబానికి ఒక గుర్తింపు ఉండేలా కార్డు తయారు చేస్తామని, వీటి వల్ల ఎన్నో లాభాలు ఉంటాయని, కుటుంబ ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు పొందుపరుస్తారని తెలిపారు. డిజిటల్ కార్డు ఆరోగ్యానికి, రైతు బంధు, బీమా వంటి సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని మంత్రి వెల్లడించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నుంచి మచిలీపట్నం నౌకాశ్రయానికి జలమార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, లోతట్టు జలమార్గాల అభివృద్ధి కింద అమరావతి నుంచి నేరుగా పోర్టు వరకూ కాలవ ద్వారా రవాణా సౌకర్యం కల్పించే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న బందరు కాలవను అవసరం మేరకు అభివృద్ధి చేసి మచిలీపట్నం వద్ద అనుసంధాన కాలవను నిర్మిస్తే జలమార్గం సిద్ధం అవుతుందని మంత్రి వివరించారు.

-----------------------------

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో ఉన్న 12 వేల 867 పంచాయతీల్లో ఒక కోటి 67 లక్షల 33 వేల 584 మంది ఓటర్లున్నట్టు తెలిపింది. ఇందులో 82 లక్షల 4 వేల 518 మంది పురుషులు, 85 లక్షల 28 వేల 573 మంది మహిళలు, 493 ఇతరులు ఉన్నారని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల కన్నా మహిళలే అత్యధికంగా ఉన్నారని ఎన్నికల సంఘం తెలిపింది.

-----------------------------

ఈ రోజు ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షకునిగా ఖ్యాతి గడించిన జంతు ప్రేమికులు, ఇటలీకి చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ అసిసి 1226వ సంవత్సరం అక్టోబర్ 3వ

తేదీన తుది శ్వాస విడిచారు. ఆయన గౌరవార్థం ఆ మరుసటి రోజు... అక్టోబర్ 4వ తేదీన ఆ ప్రాంతంలో పండుగ వంటి ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా అక్టోబర్ 4వ తేదీన ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పెంపొందించడం, వాటిని సంరక్షించడం, జంతువుల హక్కులను కాపాడడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. జంతు సంక్షేమ దినోత్సవాన్ని మొదటిసారిగా 1931వ సంవత్సరంలో అధికారికంగా నిర్వహించారు.

======================